క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకు పూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు.

16న మెగా జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జాబ్‌మేళాను ఈ నెల 16న నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 11 కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. అసెంచర్, టెక్ మహీంద్ర, సదర్‌ల్యాండ్, టెలిపర్ఫార్మెన్స్, ఏజీఎస్ హెల్త్‌కేర్, జియో, ముథూట్ ఫైనాన్షియల్ సర్వీసెస్, కెరీర్ స్కూల్, టైక్ కాస్టింగ్, బ్లూ స్టార్ ఇండియా తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని వివరించారు. సీడాప్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న జాబ్‌మేళాకు పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30కు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

రంగడి సన్నిధిలో 16న సప్తవాహన సేవలు

నెల్లూరు(బృందావనం): రథ సప్తమిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో సప్తవాహన సేవలను ఈ నెల 16న నిర్వహించనున్నామని ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమాలకు భక్తులు తరలిరావాలని కోరారు.


టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలను బుధవారం ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, కల్లూరుపల్లి, కొండ్లపూడి, ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపాన, అక్కచెరువుపాడు ప్రాంతాల్లో రెండు విడతల్లో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలం సురేష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

కేంద్రీయ విద్యాలయంలో 23, 24న ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ టీచర్ల నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూలను ఈ నెల 23, 24న నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి పీజీ చదివిన అభ్యర్థులను నియమించనున్నారని పేర్కొన్నారు. ట్రెన్డ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు సంబంధించి ఇంగ్లిష్, మ్యాథ్, సోషల్, సైన్స్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు 23వ తేదీ ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు. ప్రైమరీ టీచర్, స్పోర్ట్స్, మ్యూజిక్ కోచ్‌లు, స్పెషల్ ఎడ్యుకేటర్, ఎడ్యుకేషన్ కౌన్సెలర్, తెలుగు, యోగా టీచర్ల నియామకానికి ఇంటర్వ్యూలను 24న నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు గంట ముందే విద్యాలయానికి చేరుకొని తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తీసుకురావాలని, వివరాలకు విద్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త జయరామ్, ఈఓ వెంకటశ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పాపిరెడ్డిపాళెం పంచాయతీలో సీసీరోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం, కోవెరపాళెం పంచాయతీల పరిధిలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి కాకాణి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లోకి ఎక్కారన్నారు. గతంలో కేవలం శిలాఫలకాలు వేసి పనులు విస్మరించారని, అందుకు భిన్నంగా తాము గ్రామాల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేపడుతున్నామన్నారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు పెద్ద ఎత్తున తమకు బ్రహ్మరథం పడుతూ గ్రామాల్లో ఘన స్వాగతం పలుకుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున పింఛన్లను వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుస్తూ, ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని, మరోదఫా ఆదరిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతానన్నారు. గతంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన టీడీపీకి ప్రజలు చుక్కలు చూపించారని, మరో విడత చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధికి ఏ మాత్రం కృషి చేయని సోమిరెడ్డి పగటి వేషగాడిగా ఇప్పుడు అభివృద్ధి మంత్రం పటిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

మంత్రి కాకాణి పర్యటన సందర్భంగా కోవెరపాళెం గ్రామానికి చెందిన 15 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గంగపట్నం గురునాథం, ముత్యాల సుధాకర్, ఎం.చిట్టిబాబు, గంగపట్నం నటరాజ్‌తో పాటు మరికొందరు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, టీపీగూడూరు, పేడూరు సొసైటీ అధ్యక్షులు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కదురు వెంకటసుబ్బయ్య, తిరువళ్లూరు ఈశ్వరయ్య, టి.వెంకటేశ్వర్లు, కె.శివయ్య, డి.వెంకటకృష్ణయ్య, ఎం.చిరంజీవులగౌడ్, టి.రామయ్య, ఎ.శ్రీనివాసులురెడ్డి, ఎస్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కోవెరపాళెం టీడీపీ నేతలతో మంత్రి కాకాణి

మంచిని చూపి ఓటు అడుగుదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు చేసిన మంచిని చూపి ఓటు అడుగుదామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శేషారెడ్డి గోడౌన్‌లో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొడవలూరు మండలంలో కేవలం సంక్షేమ పథకాల ద్వారా రూ.281 కోట్లు లబ్ధిదారులకు చేరిందన్నారు. ఇవి కాకుండా మండలంలో 1,752 మందికి జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల పట్టాలిచ్చినట్లు చెప్పారు. 79 ఎకరాల అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 121 మందికి పట్టాలు ఇచ్చామన్నారు. అదేవిధంగా 470 ఎకరాల చుక్కల భూములను నిషేధిత 22–ఏ చట్టం నుంచి తొలగించి సర్వ హక్కులు కల్పించినట్లు వివరించారు. ఇలా ప్రతి మండలంలో వేల మంది లబ్ధిదారులకు వందల కోట్లను ప్రభుత్వం అందించినట్లు వివరించారు. పోతిరెడ్డిపాళెంలో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న 288 మంది రైతులకు 238 ఎకరాలకు రైత్వారీ పట్టాలు మంజూరు చేశామన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ప్రతి గ్రామంలో పనులు జరిగాయని తెలిపారు. కేవలం సంక్షేమం కాకుండా అభివృద్ధికి కూడా పెద్దపీట వేసినట్లు వివరించారు. ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధి లేదని చెబితే ఎవరూ ఊరుకోవద్దన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ గాలి జ్యోతి, జెడ్పీటీసీ పసుపులేటి సరోజనమ్మ, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రంగారెడ్డి, ఎస్.శ్రీనివాసులు, వి.నవీన్, నాయకులు ఇసనాక సునీల్‌రెడ్డి, డి.సాయిరెడ్డి, సి.మనోహర్, మాణిక్యరావు, ఆర్.రాజేష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు డి.శివకుమార్, పి.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్ల సమర్పణ



పొంగళ్ల సామగ్రితో వెళ్తున్న భక్తులు

పొదలకూరు : పొదలకూరు, చిట్టేపల్లి, లింగంపల్లి గ్రామదేవతగా పూజలందుకుంటున్న పట్టణంలోని పోలేరమ్మ తల్లికి చిట్టేపల్లి గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో సామూహిక పొంగళ్లను పెట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి పూజా సామగ్రితో బాణసంచా, తప్పెట్ల నడుమ కాలినడకన దేవస్థానానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామం పాడి పంటలు, సుఖశాంతులతో ఉండాలని ప్రతి ఏడాది పొంగళ్లు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు భక్తులు వెల్లడించారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు తీర్థప్రసాదాలతో పాటు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దాహార్తి.. దరిచేరదు

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ప్రజల కల నెరవేరనుంది. ప్రతి ఇంటికి రక్షిత నీరు అందనుంది. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా నిధులు మంజూరు చేసింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయించడంతో టెండర్లు పూర్తయి పనులు మొదలయ్యాయి. త్వరలో పట్టణ ప్రజల దాహార్తి తీరబోతోంది.

- రూ.85 కోట్లతో రక్షిత తాగునీటి పథకం
- నగర పంచాయతీలో ప్రతి ఇంటికీ తాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎస్‌ఎస్సార్ తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చి నగర పంచాయతీలో ప్రస్తుతం పది వేలకు పైగా నివాసాలున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో నగర ప్రజలకు తాగునీరు అందే పరిస్థితి లేదు. తాగునీటి పైపులైను పూర్తిగా ధ్వంసమై నీరు కలుషితమవుతున్నాయి. ఈ నీటిని తాగిన ప్రజలకు రోగాలు తప్పడం లేదు. కొందరు బయట ప్లాంట్‌లను ఆశ్రయించి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. మరికొంతమంది విధిలేని పరిస్థితుల్లో ఈ నీటిపైనే ఆధారపడవలసి వస్తోంది.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

పట్టణంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వివరించారు. తాగునీటి పథకం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన సీఎం వెంటనే నిధులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో తాగునీటి పథక నిర్మాణానికి మార్గం ఏర్పడింది.

ముమ్మరంగా పనులు

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా అందించిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చింది. దీంతో తాగునీటి పథకానికి అవసరమైన రూ.85 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఇటీవల తాగునీటి పథకం పనులు మొదలుపెట్టారు. ఎలాంటి ఆటంకం లేకుండా పనులు చకచకా జరుగుతున్నాయి.

అనుసంధానం ఇలా...

సంగం బ్యారేజీ వద్ద ఇన్‌టేక్ వెల్ నిర్మాణం చేపట్టి అక్కడ నుంచి 11 ఎంఎల్‌టీ ఫిల్టరేషన్ ప్లాంట్ వరకు 1500 మీ పైపులైన్ ఏర్పాటు చేస్తారు. సుమారు 3,900 లీటర్ల స్టోరేజీతో 5 ఎలివేటెడ్ సర్వీసెస్ రిజర్వాయర్లు(ఈఎల్‌ఎస్‌ఆర్) నిర్మిస్తారు. ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి ఈఎల్‌ఎస్‌ఆర్‌లకు అనుసంధానంగా 100 కి.మీ మేర డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు ఏర్పాటు చేస్తారు.

పదివేలకు పైగా కుళాయి కనెక్షన్లు

రక్షిత తాగునీటి పథకం ద్వారా బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతో పాటు వవ్వేరు, రామచంద్రాపురం, కట్టుబడిపాళెం, ఇస్కపాళెం గ్రామాలకు 10,650 కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి రక్షిత తాగునీరు అందిస్తారు. దీంతో నగర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి పథకానికి ఎన్‌ఎస్సార్ పేరు

తాగునీటి పథకానికి దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టాలని ఇటీవల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో జిల్లాలోని నల్లపరెడ్డి అభిమానులు, నాయకులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక ధన్యవాదాలు



తాగునీటి పథకానికి ప్రభుత్వం నా తండ్రి పేరు పెట్టడం సంతోషంగా ఉంది. నా తండ్రి చేసిన ప్రజా సేవకు గుర్తింపు ఇచ్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. ఇక బుచ్చి వాసులకు రక్షిత తాగునీరు అందుతుంది.

– నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు

ఎమ్మెల్యే కృషితోనే..



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కృషితోనే తాగునీటి పథకం రూపు దాల్చింది. ఆయన లేకపోతే ఈ పథకం మంజూరయ్యేది కాదు. ఆయనకు నగర పంచాయతీ ప్రజల తరఫున ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– మోర్ల సుప్రజ, నగర పంచాయతీ చైర్‌పర్సన్

సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ వజ్రమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ గుండాల వజ్రమ్మ

మనుబోలు : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశానికి సర్పంచ్‌లు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులందరూ పాల్గొని ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పల్లె వెలుగు బస్సులు మండల కేంద్రం గుండా వెళ్లడం లేదని, వైఎస్సార్ సర్కిల్ వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన గూడూరు ఏడీసీ నాగరాజు సమస్యను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వెలుగు ఏపీఎం వనజాక్షి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక కారణాలతో ఆసరా నగదు అకౌంట్‌లలో జమ కాకుంటే బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను సరిదిద్దుతామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కొన్నిచోట్ల పగటిపూట కూడా లైట్లు వెలుగుతున్నందున విద్యుత్ వృథా అవుతోందని, దీనిపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఇరిగేషన్ ఏఈ వేమారెడ్డి మాట్లాడుతూ సాగునీటిని రైతులు దుబారా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. పిడూరు గ్రామంలో లైన్‌మన్ అందుబాటులో ఉండడం లేదని సర్పంచ్ ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తిక్కవరపు వెంకటరమణారెడ్డి, గుండాల చందన, ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరమ్మ, లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ వెంకటరమణ, వైద్యాధికారి మొహిసినా సుల్తానా, ఏఓ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు(కోవూరు) : మండలంలోని నేతాజీనగర్‌కు చెందిన వంద మంది టీడీపీ సానుభూతిపరులు డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కోవూరు పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో వీరిని స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరుతుండడం శుభ పరిణామమన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్న విషయాన్ని అవగతం చేసుకోవడం వల్లే పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన వారు ఇప్పటికే పార్టీలో ఉన్న వారితో కలిసి జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సమైక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కవరగిరి ప్రసాద్, హరిప్రసాద్‌రెడ్డి, బాబూరావు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో మహిళా దినోత్సవం



సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సరోజినీ నాయుడు చిత్రపటానికి కమిటీ సభ్యురాలు మంజుల పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కో–కన్వీనర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సరోజినీ నాయుడు భారతదేశంలో మహిళా సాధికారత కోసం తీవ్రంగా పోరాడిన దిగ్గజం అని కొనియాడారు. అంతే కాకుండా అనేక రంగాల్లో గొప్పగా రాణించారన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి మహిళల్లో ఆమె ఒకరు అని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణంలో కుక్కల బెడద



పొదలకూరు : పట్టణంలో పందులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కుక్కలు కూడా తోడయ్యాయి. దీంతో పట్టణ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. వందల సంఖ్యలో శునకాలు ఇష్టానుసారం స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో కొత్త వ్యక్తులపై దాడులకు దిగుతున్నాయి. గుంపుగా సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. కుక్కకాటుకు గురైన వారు వ్యాక్సిన్ కోసం ప్రభుత్వ ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. ఇటీవల ఓ పిచ్చికుక్క పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సంచరించి పలువురిని గాయపరిచింది. వెంటనే పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని శునకాలను పట్టించి ఊరికి దూరంగా పారదోలాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కామాక్షితాయి సేవలో కాకాణి



స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న మంత్రి కాకాణి కుటుంబ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసి.. ఆపై చిత్రహింసలు

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో డిగ్రీ విద్యార్థిని కొందరు కిడ్నాప్ చేసి చిత్రహింసెలకు గురిచేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. తిరుపతి జిల్లా వాకాడు మండలానికి చెందిన సాయినందన్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతూ స్థానికంగా ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. బుజబుజనెల్లూరుకు చెందిన వంశీకుమార్‌తో ఈయనకు పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో సాయినందన్ తన స్నేహితుడితో కలిసి బృందావనంలోని గణేష్ మెస్ వద్ద ఆదివారం ఉండగా, వంశీకుమార్ తన స్నేహితులతో కలిసి కారులో అక్కడికి చేరుకున్నారు. సాయినందన్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. అడ్డుకోబోయిన స్నేహితుడు జశ్వంత్‌ను తోసేసి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. ఘటనపై సంతపేట పోలీసులకు జశ్వంత్ ఫిర్యాదు చేశారు. సాయినందన్‌ను కనుపూరు వద్దకు కిడ్నాపర్లు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. సాంకేతికత ఆధారంగా ఘటన స్థలానికి చేరుకొని సాయినందన్‌ను కిడ్నాపర్ల చెర నుంచి పోలీసులు విడిపించారు. నిందితులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసుపై విచారణ జరుపుతున్నారు.